

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అభిమానం

**మాల్‌లోని** రెండో అంతస్థులో ఉన్న ఫుడ్ కోర్ట్‌కి వెళ్తున్న వసుధ ఓ క్షణం నడక ఆపి, అనుమానంగా పక్కనే ఉన్న పిల్లల రెడీమేడ్ బట్టలషాప్‌లోకి చూసింది.

తర్వాత సుధాకర్ చేతిని గట్టిగా పట్టుకుని ఉద్వేగంగా అడిగింది.

"ఆవిడ కాంచన కదా?"

సుధాకర్ కూడా షాప్‌లో కస్టమర్‌కి సహాయం చేస్తున్న యువతిని చూసి చెప్పాడు.

"అవును"

ఇద్దరూ పక్కనే ఉన్న ఫుడ్ కోర్ట్‌కి వెళ్ళి బయటవేసి ఉన్న ఓ టేబుల్ ముందు కూర్చున్నారు.

"పాపం బాగా చిక్కిపోయింది" సుధాకర్ చెప్పాడు.

"అవును. తక్కువ బాధా? " వసుధ నిట్టూర్చింది.

"ఏదేమైనా ఆయన ఇలాంటి పని చేయకూడదు" సుధాకర్ చెప్పాడు.

"ఎంత గొప్ప స్థాయిలో ఉన్నా మగబుద్ధి మగబుద్దే" వసుధ నిష్ఠూరంగా చెప్పింది.

వసుధ, సుధాకర్‌లది పెద్దలు కుదిర్చిన పెళ్ళే అయినా, వారి అభిరుచులు ప్రేమికులకంటే గొప్పగా కలిసాయి. ఇద్దరికీ పుస్తకపఠనం అంటే ఇష్టం. సినిమాలు చూడటం ఇష్టం. కొత్త ప్రాంతాలు చూడటం ఇష్టం.

ట్విస్ట్‌లతో కథలు, నవలలు రాసే విరించి అనే రచయితని ఇద్దరూ అభిమానించేవాళ్ళు. పెళ్ళయ్యాక తమ భాగస్వామికి కూడా అతని రచనలంటే ఇష్టం అని తెలుసుకుని సంతోషపడ్డారు.

అనుకోకుండా అతన్ని కలుసుకోవడం వాళ్ళకో తీపి గుర్తు.

మీటర్ గేజ్ రైల్లో ఊటీకి వెళ్తున్న వాళ్ళకి తమ ఎదురు సీట్లోని విరించిని చూసి పట్టలేనంత ఆనందం కలిగింది. తరచూ పత్రికల్లో, టి.విలో కనిపించే అతను పక్కింటి అబ్బాయిలా వాళ్ళకి సుపరిచితం. అతని పక్కన ఓ అందమైన అమ్మాయి.

ఓ క్షణం తటపటాయించినా వసుధ చొరవగా అడిగింది.

"నమస్తే. మీరు విరించి కదా?"

అతను అవునన్నట్లుగా తలూపుతూ పక్కనే ఉన్న అమ్మాయి వంక కొంచెం గర్వంగా చూసాడు.

"మేము మీ అభిమానులమండీ. మీ రచనలన్నీ చదువుతాం." సుధాకర్ చెప్పాడు.

"థాంక్సండీ. ఈమె కాంచన. మొన్న మా పెళ్ళయింది. హనీమూన్‌కి ఊటీ వెళ్తున్నాం" విరించి చెప్పాడు.

"ఓ! మీ పెళ్ళయినట్లు మాకు తెలీదు. కాంచనగారు చక్కగా ఉన్నారు" వసుధ మెచ్చుకుంది.

కాంచన సిగ్గుగా తలదించుకుంది.

"అది పర్సనల్ విషయం కదండీ. పత్రికల వాళ్ళకి చెప్పడం ఎందుకు?" విరించి భార్య చుట్టూ చేతిని వేసి చెప్పాడు.

"ఐనా మీరేంటి సార్. హనీమూన్‌కి ఊటీ వెళ్తున్నారు? ఏ స్విట్జర్లాండో వెళ్ళాలికాని?" సుధాకర్ చనువుగా అడిగాడు.

విరించి పెద్దగా నవ్వి చెప్పాడు.

"రచయితకి ఈ అభిమాన ధనం తప్ప అసలు ధనం ఉండదండీ. మా కిచ్చేది చాలా తక్కువ."

"అయ్యో!" వసుధ నొచ్చుకుంది.

"నా పేరు సుధాకరండీ. తను వసుధ" సుధాకర్ మాటమార్చడానికి చెప్పాడు.

"ఓ ఇద్దరూ సుధలే. అతి మధురం" విరించి మళ్ళీ నవ్వాడు. ఊటీప్రయాణం అనగానే, ఆ టాయ్ ట్రైన్‌లో ప్రకృతిని చూస్తూ. అనుభవిస్తూ పైకి వెళ్ళాలని, అవసరమైతే తప్ప మాట్లాడకూడదని 'ఆకులోఆకునై' పాట పాడుకోవాలని చాలా రాత్రులు ప్లాన్ చేసుకున్నది మర్చిపోయి విరించి దంపతులతో మాట్లాడుతూ గడిపారు. వాళ్ళకి అదొక అందమైన అనుభవం.

ఆ తర్వాత విరించి రచనలకి స్వస్తి పలికి సినిమాలకి మాటలు రాయడానికి ప్రయత్నిస్తున్నాడని చదివి, 'పోన్లే పాపం. ఆదాయం లేకపోతే ఏం చేస్తాడు' అనుకున్నారు. అతను మాటలు రాసిన బి గ్రేడ్ సినిమాలు చూసి 'ఇవే డైలాగ్స్ పెద్ద హీరోలకి రాస్తే ఎంత పేరొచ్చేదో' అని బాధపడ్డారు.

ఓ అరడజను చిన్న సినిమాల తర్వాత విరించికి ఓ పెద్ద నిర్మాణ సంస్థ ఓ పెద్ద హీరోతో నిర్మించే సినిమాకి మాటలు రాసే అవకాశం వచ్చిందని చదివి ఆనందించారు.

ఆ రోజు పేపర్ చదువుతున్న సుధాకర్ పెద్దగా పిలిచాడు.

"వసూ!"

వంట చేస్తున్న వసుధ కంగారుగా పరిగెత్తుకొచ్చింది.

"ఇది చూసావా?" సినిమా పేజీని చూపించాడు.

విరించికి, ఆ పెద్ద నిర్మాత కూతురికి నిశ్చితార్థమైందని, మరో నెలలో పెళ్ళని వార్త. పక్కన పూలదండలతో విరించి, నిర్మాత కూతురు నిలబడి ఉన్నారు. ఇద్దరి ముఖాలు నవ్వుతో వెలిగిపోతున్నాయి.

"ఛీ ఇదేంటి?" వసుధ కంపరంగా చెప్పింది.

"అదేకదా?" సుధాకర్ కోపంగా చెప్పాడు.

"పాపం కాంచనగారు" వసుధ విచారంగా చెప్పింది.

"ఈ అమ్మాయేం బాలేదు. బహుశా ఈ పెద్ద నిర్మాతని నిచ్చెనలా వాడుకోడానికి చేసుకుంటున్నట్లున్నాడు. మంచి వాక్చాతుర్యం ఉందిగా." సుధాకర్ నిరసనగా చెప్పాడు. అతను చెప్పినట్లుగానే ఆ నిర్మాణ సంస్థ నించి దర్శకుడిగా పరిచయమైన విరించి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అయ్యాడు. అతను తీసిన సినిమాలు చూసినప్పుడు, వాటి ప్రమోషన్స్‌లో విరించిని టివిలో చూసినప్పుడు 'కాంచన ఏమైందో' అనే ఆలోచన వచ్చేది. చాలాసార్లు ఆమె గురించి చర్చించుకునేవాళ్ళు.

"చివరికి పాపం సేల్స్‌గర్ల్‌లా బతుకుతుందన్నమాట" వసుధ నిట్టూర్చింది.

"పెద్దగా చదువుకోలేదేమో?" సుధాకర్ అనుమానంగా చెప్పాడు.

"మనం మాట్లాడుకుంటూంటే నవ్వుతూ చూడటం తప్ప అసలు మాట్లాడలేదు."

"కొత్తపెళ్ళికూతురు కదా. ఆ మాత్రం బిడియం ఉంటుందిగా?"

"పుస్తకాల భాషలో చెప్పాలంటే, ఆ రోజు ఆమె కళ్ళల్లో భవిష్యత్తు గురించిన ఎన్నికలలు, ఎన్ని ఊహలు ఉన్నాయో! ఏడాది తిరక్కుండానే అన్నీ నాశనమైపోయాయి" వసుధ విచారంగా చెప్పింది.

ఓ నిమిషం ఇద్దరూ మౌనంగా కూర్చున్నాక వసుధ అడిగింది.

"మనమేం చేయలేమా?"

"అంటే?"

"ఏదైనా సాయం.."

సుధాకర్ పకపకా నవ్వి చెప్పాడు.

"నీకు సామాజిక స్పృహ బొత్తిగా లేదు సుమీ. మనమెంత? మన జీతాలు ఎంత? మనం ఇంకొకరికి సాయం చేయగల స్థితిలో ఉన్నామా?"

"నిజమే కానీ మనసుంటే మార్గం ఉండదా?" వసుధ చిన్నబుచ్చుకుని అడిగింది.

"మనలాంటివాళ్ళకి మనసుంటుంది కానీ మార్గం తోచదు" సుధాకర్ నిజాయితీగా చెప్పాడు.

"అదేదో ఆమెనే అడిగితే?" వసుధ ఉత్సాహంగా అడిగింది.

ఓ నిమిషం ఆలోచించి సుధాకర్ తలూపాడు.

"సరే పద."

ఇద్దరూ లేచి ఆ షాప్‌లోకి నడిచారు.

షాప్‌లోకి వచ్చిన కస్టమర్స్ సరాసరి తన దగ్గరికి రావడంతో కాంచన కంగారు పడింది.

"బాబా? పాపా? ఎన్ని సంవత్సరాలు?" అడిగింది.

"మేము మీ కోసమే వచ్చాం కాంచనగారూ" వసుధ చెప్పింది.

"మీరు?" కాంచన సందిగ్ధంగా అడిగింది.

"మేము ఊటీ వెళ్ళేప్పుడు రైల్లో మిమ్మల్ని కలిసాం."

కాంచన మొహంలో చిరునవ్వు చెరిగిపోయింది.

"గుర్తొచ్చింది. చెప్పండి" ముభావంగా అడిగింది.

"మీకు చాలా అన్యాయం జరిగిందండీ. విరించిగారు ఇలా చేసి ఉండకూడదు" సుధాకర్ చెప్పాడు.

కాంచన మాట్లాడలేదు.

"మీరీ షాప్‌లో పని చేస్తున్నారంటే, మీ ఆర్థికపరిస్థితి అర్థమౌతోంది. మీకు సాయపడాలని ఉంది. ఎలాగో తెలియడంలేదు. మా ఇంట్లో ఓ పోర్షన్ ఖాళీగా ఉంది. మీరు అందులో ఫ్రీగా ఉండచ్చు.."

"లేదా మీకు బేంక్ లోన్ ఇప్పించగలను. మీరే స్వంతంగా షాప్ పెట్టుకోవచ్చు."

భార్యాభర్తలు పోటాపోటీగా తాము చేయగలిగిన చిరుసాయాలు చెప్పారు.

అన్నీ విన్న కాంచన చిరునవ్వుతో అడిగింది.

"చాలా థాంక్స్. కానీ మీరు నాకు ఎందుకు సహాయం చేయాలనుకుంటున్నారు?"

"మీరు మా అభిమాన రచయిత విరించి .... " వసుధ ఆగిపోయింది.

"కదా! పూలు రాలిపోయినా దారానికి వాసన పోనట్లు విరించి మాజీభార్యగా నాకు ఇంకా గుర్తింపు ఉంది. భర్త వదిలేసిన ఎందరో భార్యలు సమాజంలో ఉన్నప్పుడు మీరు నాకు మాత్రమే ఎందుకు సాయం చేస్తానంటున్నారు? విరించి మాజీ భార్యననేగా? సారీ ఇలాంటి సానుభూతి నాకు వద్దండీ. ఈ షాప్ నాదే. నేను బానే ఉన్నాను. మా షాప్‌లో ఏమైనా నచ్చితే తీసుకోండి. మీకు 30% డిస్కౌంటుతో ఇస్తాను" కాంచన అభిమానంగా చెప్పింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments